20072024-DIS-04_Layout 1 7/20/2024 2:57 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణపై చెరగని సంతకం

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

పాలకులు వస్తుంటారు, పోతుంటారు. కానీ, కొంతమందే ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకుంటారు. అనితర సాధ్యమనుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేయడమే కాకుండా, తెలంగాణ వస్తే ఏమొస్తుందని అనుకున్నామో వాటిని కండ్లముందే ఆవిష్కరించారు, తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్నారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. ఒక వ్యక్తి కాని, వ్యవస్థ కాని గొప్ప పేరు సంపాదిస్తే వాళ్లను తక్కువగా చూపించి, వారిపై బురద చల్లాలని కొందరు కుయుక్తులు పన్నుతూనే ఉంటారు. మరీ ముఖ్యంగా రాజకీయాల్లో.

కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని మరిపించి.. కాళేశ్వరంలో అవినీతి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు కేసీఆర్‌పై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కొత్తగా గెలిచాం, ప్రజలకు ఏమైనా మంచి పనులు చేద్దాం అన్న సోయిని మరిచి, ఎదురుదాడికి దిగేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్ హయాంలో ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమంలో ముందుకు సాగుతుండగా.. గోరంత సమస్యలను కొండంతగా చూపించి, విష ప్రచారం చేయడం మూలంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. 'మనం మంచి చేస్తున్నాం కదా, వాళ్లు చెడుగా చెప్పినంత మాత్రాన అయ్యే దేమున్నది, ప్రజలు వాళ్ల మాటలు నమ్ముతారా' అని అనుకోవడం మూలంగా జరగరాని నష్టం జరిగింది బీఆర్ఎస్‌కు, తెలంగాణకు. చెడుతో సమాంతరంగా మంచి కూడా ప్రచారం చేస్తూనే ఉండాలని అంటారు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్. అయితే ఎవరెన్ని విమర్శలు చేసినా సత్యం ఎన్నటికీ సత్యమే అవుతుంది. తెలంగాణలో వందేండ్లలో జరగని అభివృద్ధి కేసీఆర్ పాలనలో 9 ఏండ్లలోనే జరిగిందనేది వాస్తవం. రైతుబంధు స్థానంలో రైతు భరోసా ఇస్తామని చెప్పి చేతులెత్తేసిన రేవంత్ సర్కార్ రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఇప్పుడు ఊదరగొడుతున్నది. వాస్తవానికి కేసీఆర్ పాలనలో రెండుసార్లు రుణమాఫీ జరిగింది. మొదటిసారి 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్లు, రెండవసారి 22.98 లక్షల మంది రైతులకు రూ.13,000 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయి. రేవంత్ సర్కార్ రూ.లక్ష వరకు రుణమాఫీ అంటూ ఆంక్షలు పెట్టి రైతుల సంఖ్యను కుదిస్తున్నది. 11.42 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.6098 కోట్ల రుణాన్ని మాత్రమే మాఫీ చేసింది. 'మూడు రంగుల జెండా పట్టి సింహమోలే కదిలినాడు.. మా రేవంతన్న' అంటూ ముసిసి ఓట్లేసిన వారు నేడు కంగుతింటున్నారు.

రోహిణి కార్తె వచ్చింది. గతంలో ఈపాటికే రైతుబంధు డబ్బులు పడ్డాయా? అని రైతులు ఫోన్ల వైపు చూసేవారు. ఎలాంటి మెసేజ్ వచ్చినా ఖాతాలో డబ్బులకు సంబంధించి మెసేజ్ వచ్చిందేమో అని చూసేవారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఇప్పటి వరకు రైతుబంధు పైసలు జమ కాలేదు. రైతు బిడ్డ కేసీఆర్ అహర్నిశలు రైతుల బాగోగుల గురించే ఆలోచించేవారు. తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల గురించి కాబట్టి, వాటిని అమలు చేయడానికి శాయశక్తులా కృషి చేశారు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా రైతులకు మాత్రం రైతు బంధు ఆప లేదు. వాన కాలం, యాసంగిలో పంట సాగు సమయంలో రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేసేవారు. కేసీఆర్ పాలనలో పురుడు పోసుకున్న రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయి. అయితే మాటలు కోటలు దాటుతున్నాయి కాని చేతలు గడప దాటనట్టుంది రేవంత్ పాలన. కరెంటు, సాగునీటి కష్టాలకు తోడు పంట పెట్టుబడి సాయం అందని ద్రాక్షగానే మిగిలింది. గత యాసంగి సీజన్ రైతు బంధు వానకాలంలో విడుదల చేశారు. ఇక వానకాలం రైతు బంధు ఎప్పుడు ఇస్తారో తెలియదు. ఏడు నెలల్లోనే ఏం కోల్పోయామో ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. నిరుద్యోగుల ఆందోళనలు షురూ అయ్యాయి. గడీల పాలన, దొరల పాలన, మద్యం ఏరులై పారుతుందంటూ ఊదరగొట్టిన యూట్యూబ్ చానళ్ల దుష్ప్రచారాన్ని ప్రజలు నేడు అసహ్యించుకుంటున్నారు.



ఇక తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఒకసారి అవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం పదవిని త్యజించి, పిడికెడు మందితో ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రతిఒక్కరిని ఉద్యమంలోకి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌ది. నాటి ఉద్యమంలో నేటి ముఖ్యమంత్రి రేవంత్ పాత్ర సున్నా. బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పదవిని పట్టుకొని వేలాడారు. ఈ రోజు నీతులు చెప్తున్న కాంగ్రెస్ నాయకులు నాడు అసువులు బాసిన అమరులకు కనీసం నివాళి కూడా అర్పించలేకపోయారన్న విషయాన్ని మరిచిపోరాదు. కేసీఆరే లేకుంటే, తెలంగాణ సాధించుకోకుంటే నేడు కొలువు తీరిన నాయకులు ఎక్కడ ఉండేవారో. తెలంగాణను సాధించి, కేసీఆర్‌తో పాటు మిగతా వారికి సైతం ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన విషయం మరువరాదు.

> **'తెలంగాణ వస్తే కారు చీకట్లే, కరెంటు ఎక్కడి నుంచి తెచ్చుకుంటారు. మీకు పాలన చేత కాదు'.. ఇలా ఒక్కటేమిటి పోతూ పోతూ సమైక్య పాలకులు ఇక్కడి ప్రజల్లో ఆందోళన, అలజడి రేపుతూ వెళ్లారు. అయితే ఏడాది పాటు కరెంటు కష్టాలు ఉంటాయని, తర్వాత మూడు నాలుగేండ్లలో 24 గంటల కరెంటు సరఫరా చేసుకుంటామని కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే మొదట్లోనే చెప్పారు. అన్నట్టుగానే 24 గంటల కరెంటు సరఫరా చేసి సరికొత్త చరిత్ర సృష్టించారు కూడా.**

తెలంగాణలో గతంలో తాళిని సైతం కుదువ పెట్టి పెట్టుబడులు సమకూర్చుకున్న రైతుల దయనీయ జీవితాలు పల్లెపల్లెన కనిపించేవి. అలాంటి పరిస్థితుల్లో చీకట్లను చీల్చుకుంటూ వచ్చే ఉషోదయపు వెలుగులా కేసీఆర్ రైతులకు అండగా నిలిచారు. రైతు బంధు పథకం రైతులకు కొండంత అండగా నిలిచింది. రైతుబంధు ద్వారా తెలంగాణలో లక్షల మంది రైతులకు కోట్లాది రూపాయలు అందించారు. అలాగే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందించారు. రైతు కుటుంబాలకు అండగా ఉండటానికి పక్కా ప్రణాళికతో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు బీమా పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. రైతు మరణిస్తే వారం రోజుల్లో నామినీకి రూ.5 లక్షల బీమా వచ్చే విధంగా చేశారు. అధికారుల చుట్టూ తిరగకుండా, నయా పైసా ఖర్చు లేకుండా భూమి పట్టా చేసుకునే వీలు ధరణితో కలిగింది. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, నల్గొండ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరాయి. ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. రైతు సమస్యలను చర్చించి, పరిష్కరించడానికి రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వందలాది రైతు వేదికలు నిర్మించారు. నీటి తీరువాను రద్దు చేయడంతో పాటు పంట ధాన్యాలకు మద్దతు ధర అందించారు. ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం నిలువ కోసం పెద్ద ఎత్తున గోదాములను నిర్మించారు. బిందు సేద్యంతో పాటు, పాలీహౌజ్, గ్రీన్‌హౌజ్‌ల నిర్మాణం కోసం కృషి చేశారు. వరి దిగుబడిలో పదేండ్లలోనే పంజాబ్‌కు దీటుగా నిలిచింది తెలంగాణ.

'సంపద పెంచు, ప్రజలకు పంచు' అనే నినాదంతో కేసీఆర్ ముందుకు సాగారు. ఉమ్మడి పాలనలో పింఛన్ రూ.200 మాత్రమే ఉండగా, వితంతువులు, వృద్ధులకు రూ.2016, దివ్యాంగులకు రూ.4016 అందించి పేదల గుండెల్లో నిలిచిపోయారు కేసీఆర్.

తెలంగాణ రాకతో సింగరేణి దశ దిశ మారిపోయింది. సింగరేణి టర్నోవర్ రూ.12 వేల కోట్ల నుంచి రూ.33 కోట్లకు చేరింది. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనంగా జాతీయ అవార్డులు వచ్చాయి. గురుకుల పాఠశాలలను గణనీయంగా పెంచడంతో పాటు డైట్ చార్జీలు పెంచి విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. మన ఊరు- మన బడి ద్వారా పాఠశాలల అభివృద్ధి, ఐటీ పరిశ్రమలు, జిల్లాకు ఒక వైద్య కళాశాలల ఏర్పాటు, కంటి వెలుగు, డయాలసిస్ సౌకర్యం, బస్తీ, పల్లె దవాఖానలు, కేసీఆర్ పోషకాహార కిట్లు, హైదరాబాద్ నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, 4 లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు, అన్ని హంగులతో సచివాలయం, యాద్రాద్రిని గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దడం, అనాథలకు చేయూత ఇలా ఎన్నో కార్యక్రమాలకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తెలంగాణను దేశంలోనే నెం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దిన కేసీఆర్ తెలంగాణపై చెరగని సంతకం చేశారు.

> తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆనాడు రైతుబంధు కోసం ట్రెజరీలో జమ చేసిన రూ.7 వేల కోట్లను డిసెంబర్‌లో ఇవ్వకుండా, అసలు రైతుబంధునే ఎగ్గొట్టి ఇప్పుడు అదే డబ్బును రుణమాఫీ పేరుతో.. కేసీఆర్ కట్టిన 577 రైతు వేదికల్లో ఉన్న రైతులను ఉద్దేశిస్తూ, కేసీఆర్ కట్టిన సచివాలయం నుంచి రుణమాఫీ డబ్బా కొట్టుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ఏక కాలంలో మొత్తం మాఫీ అని హామీ ఇచ్చి విడతల వారీగా, అదీ అరకొరగా ఇస్తూ తనకు అల వాటైన మోసానికి పాల్పడుతున్నది కాంగ్రెస్ పార్టీ.

కేసీఆర్ కట్టిన రైతు వేదికల్లోనే!

శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371

'తిన్నా తినకపోయినా నెలకు ఏడు వేల కోట్ల రూపాయలు మిత్తి కడుతున్నడు భట్టి విక్రమార్క' అని గొప్పలకు పోయిండు రేవంత్ రెడ్డి. కానీ, వాస్తవమేమంటే.. భట్టి గారి సంపాదన ఇబ్బడి ముబ్బడిగా పెరగడం! సచివాలయం, ప్రజాభవన్ వేదికగా భట్టి ద్వారా మాత్రమే కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తున్నరు. ఎవరికెంత ఇస్తే బిల్లు పాస్ అవుతున్నదో కాంట్రాక్టర్లు బహిరంగంగా చెప్తున్నరు. పొంగులేటి సారు లీలలు వేరే రేంజ్! మిగిలిన మంత్రులదీ ఇదే దారి. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సాండ్, ల్యాండ్ మాఫియాకు హద్దుల్లేవు. కింది నుంచి పైదాకా.. 'నీకింత, నాకంత' వ్యవహారం నడుస్తున్నది. ఇక ఈ కలెక్షన్ల కోసం ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాలరావు లాగా ప్రత్యేకంగా ఐదారు డిపార్ట్‌మెంట్లే ఏర్పాటైనట్టు చెప్తున్నరు.

ఈ వ్యవహారం ఇట్లా ఉంటే.. హాస్టళ్ల మెస్‌లలో ఎలుకలు, పిల్లులు, బల్లులు రాజ్యమేలుతున్నయి. కుక్కల స్వైరవిహారానికి చిన్నారులు చితికిపోతున్నరు. హైదరాబాద్, ఢిల్లీలో ఉద్యోగార్థులు కదం తొక్కుతున్నరు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ నాయకుల పంచాయితీకి అడ్డాలుగా మారినయి. హక్కుల గురించి అడిగితే చెప్పుతో కొడతామంటున్నరు. శాంతిభద్రతలు విఫలమై నడిరోడ్లపై నరుక్కు చస్తున్నరు. కరెంట్ లేక రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నయి. ఆస్పత్రుల్లో సౌకర్యాల లేమి తారస్థాయికి చేరింది.

> **ఇవేవీ మీడియాకు, మేధావులకు పట్టడం లేదు. తాము జాకీలు లేపి ఎత్తి పట్టిన మరుగుజ్జులను ఇంకా ఇంకా మోస్తున్నరు. నిజాలు దాస్తున్నరు. బీఆర్ఎస్ ఆరోపణలను పక్కన పెట్టండి, జనాల ఆక్రందనలు కూడా వీళ్ల మీడియాలో చోటుకు నోచుకోలేకపోతున్నయి.**

అయితే అబద్ధాల పునాదుల మీద కట్టిన మేడ నిలవదు. నాలుగున్నరేండ్లు కాదు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే మీ అంతు చూస్తామని కాంగ్రెస్‌కు లిఖిత పూర్వక హెచ్చరికలు అందుతున్నయి వివిధ వర్గాల ప్రజా బాహుళ్యం నుంచి.

> **ఇపుడు ఈ రాష్ట్రాన్ని బాగుచేసే బాధ్యత నికార్సైన తెలంగాణ బిడ్డలపై ఉన్నది. గెలిచినా, ఓడినా.. ఎవరున్నా, ఎవరు పోయినా గులాబీ జెండా రెపరెపలాడుతది. తెలంగాణ మళ్లీ తల ఎత్తుకుని నిలుస్తది!**

జై తెలంగాణ!

> కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే బీసీ కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అంతేకాదు, అధికారంలోకి వచ్చాక బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి, ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని, ఐదేండ్లలో మొత్తంగా లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి రాష్ట్ర సీఎం అయ్యారే కానీ, ఇచ్చిన మాట మాత్రం నిలబెట్టుకోలేకపోయారు. కులగణన, సబ్‌ప్లాన్‌తో సహా అన్ని అంశాలను విస్మరించి బీసీలను దగా చేశారు.

రిజర్వేషన్లు కల్పించాలె

బూర్గుపల్లి కృష్ణయాదవ్
98661 70384

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలైంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్నది. రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరుగుతాయి. ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉండి ఉంటే ఈపాటికే కులగణన చేపట్టి, ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేది. ప్రభుత్వం తాత్సారం చేస్తుండటంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది.

ఇక బీసీ డిక్లరేషన్ విషయానికి వస్తే.. ప్రతి మండలానికి బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని, ర్యాంకుతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పింది. కానీ, ఆ హామీ నేటికీ అమలు కాలేదు. ప్రతి జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో బీసీ భవన్ నిర్మిస్తామని, అన్ని కులాల వారికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అర్హులైన వారికి రూ.10 లక్షల రుణాలు అందిస్తామని చెప్పి మాట తప్పారు.

అంతేకాదు, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అద్భుతమైన పాలన అందిస్తున్నామని గొప్పలకు పోతున్నారు ముఖ్యమంత్రి రేవంత్. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని రేవంత్ చెప్పారు. కానీ, ఆరు నెలలు దాటినా రైతు భరోసా, యువ వికాసం, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల పెట్టుబడి సాయంతో పాటు ఇతర అనేక హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడంపై రాష్ట్ర ప్రజలు గుర్రుగా ఉన్నారు.

> **'మాది రైతు ప్రభుత్వం' అని గొప్పలు చెప్పుకొనే ముఖ్యమంత్రి.. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఎకరాకు రూ.7500 చొప్పున వెంటనే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.**

అన్ని వర్గాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనతికాలంలోనే అన్ని వర్గాల్లోనూ వ్యతిరేకతను మూటకట్టుకున్నది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా రేవంత్ సర్కార్ తన తీరును మార్చుకోవాలి. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలి.

దేశ రక్షణను పణంగా పెట్టలేం!

రక్షణ రంగానికి చెందిన మెజారిటీ కాంట్రాక్టులు భారతీయ పరిశ్రమలు, భారతీయ భాగస్వాములతోనే ముడిపడి ఉన్నాయి. ఆత్మనిర్భరత అనేది దేశ రక్షణను పణంగా పెట్టి జరగకూడదు. దేశ రక్షణకే ఎప్పుడూ ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

- ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్, ఐఏఎఫ్ వైస్ చీఫ్

క్లౌడ్ సర్వీసుల భద్రత ప్రశ్నార్థకమేనా?

చెర్మాల శ్రీనివాస్

ఎటువంటి సైబర్ దాడి లేదు.. ఎక్కడా వైరస్ కనబడలేదు.. ముందుగా ఎలాంటి హెచ్చరికా లేదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలను వాడుతున్న కార్పొరేట్ సంస్థల కంప్యూటర్లన్నీ అకస్మాత్తుగా ఆగిపోయాయి. ఎయిర్‌లైన్స్, ఆసుపత్రులు, బ్యాంకులు, ప్రసార మాధ్యమాలకు సంబంధించిన అన్ని కంప్యూటర్ తెరలపై విండోస్ బూట్ స్క్రీన్ వచ్చి ఆగిపోయాయి. ఫలితం, వేల కోట్ల నష్టం. సేవలన్నీ విపరీతమైన ఆలస్యమయ్యాయి. వీలైన కంపెనీలు ఒక్కొక్క కంప్యూటర్ విడిగా పనిచేయాల్సి వచ్చింది. ఇంతటి నష్టానికి కారణమైన మైక్రోసాఫ్ట్, దానికి ఈ రక్షణ వ్యవస్థల సేవలు అందించే సంస్థ అభరికి చెప్పిందేమిటంటే.. సమస్యను గుర్తించాం.. పరిష్కారం కనుగొన్నాం.. పరిస్థితులు వేగంగా అదుపులోకి వస్తున్నాయని. కానీ, అసలు సమస్య ఎందుకొచ్చింది? అంటే.. ఎవరి దగ్గరా సమాధానం లేదు. బహుశా రాదు కూడా.

క్లౌడ్ సర్వీసెస్.. అంటే, ఒక సంస్థకు అవసరమైన సర్వర్లు, సాఫ్ట్‌వేర్లు, ఇంజినీర్లను సొంతంగా పెట్టుకుని ఆ డాటా సెంటర్‌ను మెయింటేన్ చేయడం కష్టంతో కూడుకున్న పనిగా నిర్ధారిస్తూ, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు తాము సొంతంగా భారీ స్థాయిలో డాటా సెంటర్లు నెలకొల్పి, ఆయా సంస్థలకు అద్దె ప్రాతిపదికన సేవలందించడమే క్లౌడ్ కంప్యూటింగ్. సంస్థల సమాచారానికి అత్యంత భద్రత, గోప్యత కల్పిస్తామని హామీ ఇస్తూ మైక్రోసాఫ్ట్ అజూర్ పేరిట ఈ సేవలు ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభించింది. ఈ సేవలు అందుబాటులోకి వచ్చిన క్షణం నుంచీ వెంటనే అన్ని సంస్థలూ, దీనికే మొగ్గుచూపాయి. కారణం, సొంత డాటా సెంటర్‌కు భారీ స్థాయి ప్రాథమిక పెట్టుబడులు, మానవ వనరులు, నిరంతర మెయింటేనెన్స్ అవసరం లేకపోవడమే. క్లౌడ్ కంపెనీలకు నెలనెలా అద్దె చెల్లించి, వారి సర్వర్లను వాడుకోవడం అందరికీ సులభంగా కనిపించింది. నిజానికి వాస్తవం కూడా. కానీ, ఇక్కడ సమస్యల్లా సమాచార భద్రత, సర్వర్ల పని తీరు. ఇవాళ జరిగిన ప్రమాదం అన్నివేళలా జరిగే అవకాశం ఎప్పుడూ ఉంది. ఎందుకంటే, వ్యవస్థలన్నీ మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ల మీద పనిచేయడమే. ప్రపంచంలోని 73 శాతం కంప్యూటర్ వ్యవస్థలు మైక్రోసాఫ్ట్ విండోస్ మీదే నడుస్తాయి. మిగిలిన 27 శాతం మ్యాక్‌లు, లైనక్స్‌ల మీద ఉంటాయి. అసలు సమస్య మొదలైంది ఇక్కడే. విండోస్ ఏకఛత్రాధిపత్యం వల్ల ప్రపంచ సమాచార వ్యవస్థ పూర్తిగా మైక్రోసాఫ్ట్ గుప్పిట్లోకి వెళ్లిపోయింది. దాంతో సహజంగానే పొరపాట్లు, దాడులు కూడా దానిమీదే ఎక్కువవుతాయి. సరే.. దాడుల సంగతి వేరే అనుకున్నా, మరి పొరపాట్ల సంగతేంటి? నిజానికి అసలు ఈ రోజు జరిగిందేమిటో ఒకసారి చూద్దాం.

మైక్రోసాఫ్ట్ తన ఆపరేటింగ్ సిస్టమ్ విండోస్‌ను సైబర్ దాడులు, వైరస్‌ల నుంచి పూర్తిస్థాయి భద్రత కల్పించేందుకు ఓ మూడు కంపెనీలకు బాధ్యతలను అప్పజెప్పింది. అందులో ఒకటి క్రౌడ్‌స్ట్రైక్. ఇది ఎప్పటికప్పుడు మైక్రోసాఫ్ట్ వ్యవస్థలపై జరుగుతున్న దాడులను ముందే గుర్తించి, వాటికి అనుగుణంగా చిన్న చిన్న సాఫ్ట్‌వేర్లను తయారుచేసి విండోస్‌కు అప్‌డేట్ రూపంలో పంపిస్తుంది. ఆ అప్‌డేట్ వెంటనే ప్రపంచవ్యాప్తంగా ఉన్న విండోస్ కంప్యూటర్లలో చేరిపోయి, దాడిని సమర్థవంతంగా నిరోధిస్తుంది. అన్నట్లు ఈ క్రౌడ్‌స్ట్రైక్ మైక్రోసాఫ్ట్‌కే కాకుండా ఇతర సంస్థలకు కూడా తన రక్షణ ఉత్పత్తులను అమ్ముతుంది. అయితే ఇవాళ ఉదయం రోజువారీ అప్‌డేట్‌ల పంపిణీలో భాగంగా పంపిన ఒకానొక అప్‌డేట్, అకస్మాత్తుగా అన్ని కంప్యూటర్ వ్యవస్థలను కోమాలోకి పంపింది. ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. చూస్తుండగానే ఒక్కో సంస్థా కుప్పకూలడం మొదలైంది. మధ్యాహ్నానికల్లా ప్రపంచవ్యాప్తంగా చాలా పెద్ద సంస్థల్లో పనులు ఆగిపోయాయి. బ్యాంకు లావాదేవీలు, విమానాల రాకపోకలు, ఆసుపత్రుల నివేదికలూ.. ఇలా ప్రజలకు నిత్యావసరాలు ఉన్న చాలా సంస్థల్లో సేవలు స్తంభించాయి. ఇవన్నీ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవ అయిన అజూర్‌ను వాడుతున్నవే. మధ్యాహ్నం తర్వాత క్రౌడ్‌స్ట్రైక్ సంస్థ తాము దీనికి పరిష్కారం కనుగొన్నట్లు, వెంటనే కొత్త అప్‌డేట్ పంపిణీ మొదలైనట్లు ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ మాత్రం దీనిపై ఆచితూచి వ్యవహరిస్తున్నది. విషయం తమ దృష్టికి వచ్చినట్లూ, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు, చాలా చోట్ల వ్యవస్థల పనితీరు మెరుగుపడినట్లు చెప్పింది. అంతకుమించి ఎటువంటి బాధ్యతను మైక్రోసాఫ్ట్ తీసుకున్నట్లు కనిపించలేదు.



భారత్‌కు చెందిన ప్రభుత్వ సంస్థ సెర్ట్ (కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్) వెంటనే భారత్‌లో ఈ వైఫల్యానికి గురైన సంస్థలకు అత్యవసర పరిష్కారాన్ని సూచించింది. వినియోగదారులందరూ చెప్పినదాని ప్రకారం తమ కంప్యూటర్లలోని కొత్త అప్‌డేట్‌ను డిలీట్ చేస్తే సమస్య వెంటనే పరిష్కారమవుతుందని చెప్పింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తాము అనుక్షణం మైక్రోసాఫ్ట్‌తో సంప్రదింపుల్లో ఉన్నామని, మన జాతీయ సమాచార కేంద్రాని(ఎన్ఐసీ)కి ఎలాంటి ముప్పూ వాటిల్లలేదని తెలిపారు.

ప్రస్తుతానికి సమస్య పరిష్కారమవుతుంది. కానీ, ఇలాంటి సమస్య మళ్లీ రాదని మైక్రోసాఫ్ట్, దాని అనుబంధ సంస్థలు గ్యారంటీ ఇవ్వగలవా? లేదు. ఎప్పటికీ ఇవ్వలేరు. ఎందుకంటే మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ వలయం నుంచి ప్రపంచంలోని ఏ కంప్యూటరూ తప్పుకోలేదు. ఒకటి కాకపోయినా, ఇంకోచోటైనా మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు వాడాల్సిన పరిస్థితి. జరిగింది ఒక పొరపాటు. పొరపాట్లు మళ్లీ జరగవని చెప్పలేం. ఈ పొరపాట్లే మళ్లీ మళ్లీ సంస్థల పాలిట గ్రహపాట్లుగా మారుతూనే ఉంటాయి. కాకూడదంటే మైక్రోసాఫ్ట్‌కు ప్రత్యామ్నాయంగా ఒక దీటైన అపరేటింగ్ సిస్టమ్ రావాలి. దానికి అన్ని అప్లికేషన్లు తయారుచేసే సంస్థల మద్దతు కావాలి. అది దాదాపుగా అసాధ్యం. ఇప్పటికీ 15 శాతం మార్కెట్ షేర్‌తో యాపిల్ మ్యాక్ ఓఎస్ రెండోస్థానంలో ఉంది. ఇంకో ఓఎస్ అయిన లైనక్స్ వాటా 4 శాతమే. అప్లికేషన్లు ఆయా ఓఎస్‌లపై తయారు కాకపోతే ఆ ఓఎస్‌కు మార్కెట్ ఉండదు. ప్రస్తుతం దాదాపుగా అన్ని అప్లికేషన్లు విండోస్ ప్లాట్‌ఫారంపైనే ఉన్నాయి. పెద్దపెద్ద సర్వర్ల విండోస్ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ ఎడిషన్లు తయారుచేసే సామర్థ్యం ఇతర కంపెనీలకు లేదు. దాంతో మైక్రోసాఫ్ట్ ప్రపంచానికి మెడకు పడ్డ పాములా తయారైంది. అందుకే సైబర్ దాడులూ, వైరస్ దాడులు, రాన్సమ్‌వేర్ దాడులు అన్నీ విండోస్‌ను లక్ష్యంగా చేసుకునే జరుగుతున్నాయి. ఇవాళ జరిగిన భద్రతా అప్‌డేట్ లోపం యాపిల్ మ్యాక్, లైనక్స్‌లను ఏం చేయలేదు. అది విండోస్ సొంత పొరపాటు మాత్రమే.

ఇలా సంస్థలు తమ సొంత సమాచారాన్ని, ఎక్కడో బయట ఉండే సర్వర్లలో నిక్షిప్తం చేసి వాటి ద్వారా వాడుకోవడం ఎంతవరకు సబబు అనేది ప్రశ్నార్థకం. సమాచార భ